సమీక్షా వ్యాసం

# గిరిజనులను దోపిడీ చేస్తున్నది మనమే కదా?




'ఈ శతాబ్దారంభంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో మన్య ప్రాంతపు పితూరీ జరిగినప్పుడు మన సమాజం ఉలిక్కిపడింది. ఆశ్చర్యపడింది. అల్లూరిని ఆరాధించసాగింది. అంతే! అల్లూరి ఏ లక్ష్యం కోసం తన పోరు సాగించారో, ప్రాణాలర్పించారో అది - గిరిజనోద్ధరణ - అది మాత్రం మరిచిపోయింది.'

[మన్య ప్రాంత చైతన్య యాత్ర - మన్య ప్రజల ప్రత్యేక సంచిక -1 ప్రచురణ : 'శక్తి', రంపచోడవరం - 533 288; వెల: రూ.15.00]

రామాయణ కాలం నుంచీ గిరిజనులు మన సమాజానికి తోడ్పాటు అందిస్తూనే ఉన్నారు. వానరులు గిరిజనులే కదా - కాని వారి గురించి చోద్యంగా కొన్ని కథలు చెప్పుకోవడమే కాని, మన సమాజం వారిని గురించి పట్టించుకున్నది లేదు. ఈ శతాబ్దారంభంలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో మన్య ప్రాంతపు పితూరీ జరిగినప్పుడు మన సమాజం ఉలిక్కిపడింది. ఆశ్చర్యపడింది, అల్లూరిని ఆరాధించసాగింది. అంతే! అల్లూరి ఏ లక్ష్యం కోసం తన పోరు సాగించారో, ప్రాణాలర్పించారో అది - గిరిజనోద్ధరణ - మాత్రం మరిచిపోయింది.

మళ్ళీ ఇటీవలి కాలంలో నక్సలైట్ల విజృంభణతో గిరిజనులు కొద్దిగా మన దృష్టిలోకి వచ్చారు. నక్సలైట్లు ఆ గిరిజనులకే తమ కార్యక్రమాలు పరిమితం చేసి ఉంటే మళ్ళీ మనం కథలుగా చెప్పి ఆనందిద్దుము. కాని నక్సలైట్లు గిరిజన ప్రదేశాలు, కొండలు, అడవులూ తమ స్థావరాలుగా చేసుకుని అక్కడి నుంచి మిగిలిన సమాజంపై దాడులు జరుపుతుంటే మనం కలవరపడసాగాము. మన ప్రభుత్వమూ కలవరపడుతోంది. అంతే కాదు తన అశక్తతను వెల్లడించుకుంటోంది. కాని ఇప్పటికీ సమాజం కానీ, మనం ప్రభుత్వం గానీ గిరిజనుల గురించి పూర్తి నిజం తెలుసుకోవడం లేదు.

అది అలా ఉంచి ఇటీవల మనం పర్యావరణ రక్షణ గురించి ఆందోళన పడుతున్నాం. ఓజోన్ పొర చిల్లులు పడుతోందంటే మానవ జాతి మనుగడకే ముప్పనీ, వాతావరణం విషమయం అయిపోతోందనీ ఆక్రోశిస్తున్నాం. వీటి అన్నిటికీ కారణం అడవులు తగ్గిపోవడం, నష్టపోవడం అని ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నాం. అడవులనేసరికి ఆ అడవుల్లో ఉండే గిరిజనులు మళ్ళీ మన ముందుకు వస్తున్నారు. 'పోడు' వ్యవసాయం వంటి వ్యర్థ విధానాల ద్వారా తమ కోసం, అమ్మకం కోసం వంట చెరకు కావాలని అడవుల విధ్వంసానికి వారే కారణమన్న అపోహ మనలో వ్యాపించింది.

ఇది సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని సత్యంగా చిత్రించే అపోహ. అడవులను నష్టపరిచేది గిరిజనులు కాదు. అడవులు నష్టపోతే మిక్కిలి నష్టపోయేది వారే. అడవుల పరిరక్షణ మీదే వారి బ్రతుకులు ఆధారపడి ఉన్నాయి. మనమే మన జల విద్యుత్ పథకాల కోసం, కలప అవసరాల కోసం, వంట చెరకు కోసం, అంతకంతకూ ఎక్కువ అవసరమవుతున్న పంటలు పండించడానికి అదనపు భూముల కోసం అడవుల్ని ఘోరంగా నష్టపరుస్తున్నాం. గిరిజనుల జీవితాలలో చిచ్చు పెడుతున్నాం.

అంతే కాదు, మన వ్యాపారులూ, కాంట్రాక్టర్లూ, అటవీ శాఖ వారూ గిరిజనుల్ని దారుణంగా దోపిడీ చేస్తూనే వచ్చారు. గిరిజనుల జీవనోపాధికి కానీ, వారి చదువు, సంస్కారాలకు కానీ మనం చేసింది ఏమీ లేదు. వారి బ్రతుకులేవో వారే బ్రతుకుదామని వారు కోరినా మనమే వారిని బ్రతకనీయడం లేదు. శ్రీకాకుళం పోరాటం తరువాత ప్రభుత్వం మేల్కొని గిరిజనోద్ధరణ కోసం, సంక్షేమం కోసం కొన్ని కార్యక్రమాలు తలపెట్టింది, ఆ కార్యక్రమాలు మంచివే కూడా! కాని కొన్ని హృదయం లేని అధికార తత్వంతో అసమగ్రంగా అమలుపరచడం కారణంగా వాటి ప్రభావం అంతంతమాత్రంగా ఉండిపోయింది.

ఈ పరిస్థితులలో గిరిజనుల నిజమైన హితైషులతో కూడిన స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతైనా ఉంది. గిరిజనుల సమస్యలనగానే ముందు నక్సలైట్లు గుర్తుకు వస్తారు. కాని వారి దొక మార్గం. వారు హింసలో పూర్తిగా నిస్సంకోచంగా విశ్వాసం కలవారు. వారు ఒక సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నవారు. సహజంగా ఇతర మార్గాలు ఉండి తీరుతాయి. అటువంటి భిన్న మార్గాన పయనిస్తూ రంపచోడవరంలోని 'శక్తి' వంటి సంస్థలు సుమారు 70 ఈ క్షేత్రంలో త్రికరణ శుద్ధిగా కృషి చేస్తున్నాయి. ఆ సంస్థలన్నిటి తరఫున 'శక్తి' ప్రచురించిన గ్రంథమే ఇది.

మామూలుగా చదవడానికి వీలు లేదు. ఇది ఒక కమిషన్ నివేదికలా ఉందనవచ్చు. ఇందులో ఈ స్వచ్ఛంద సంస్థలు చెప్పదలచుకున్నదే కాక ప్రభుత్వాధికారులూ, ప్రాజెక్టులు నడుపుతున్నవారూ, విశ్వవిద్యాలయాచార్యులు చేసిన ప్రసంగాలు కూడా చేర్చారు. పుస్తకం మొత్తం గిరిజనుల జీవన పద్ధతులనూ, వారు గురవుతున్న దోపిడీనీ, వారెదుర్కొంటున్న సమస్యల్నీ సాక్ష్యాధారాలతో మనముందు పెడుతుంది. అందువల్ల సమాజ చింతన కలవారందరూ చదివి తీరవలసిన పుస్తకం. సరైన అవగాహన ఉంటేనే మనం సరిగా పనిచేయుగలం. అటువంటి అవగాహనే ఈ పుస్తకం కలగజేస్తుంది.

ఇంకొక పక్షముంది. కేవలం బయటివారు తెలుసుకుని గిరిజనులనుద్ధరించబూనడంతో సరిపోదు. గిరిజనులు స్వయంగా తమ ఉద్ధరణకు పూనుకోవాలి, తమ సమస్యలు పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి. అంటే వారిలో చైతన్యం కలగాలి. ఆ ఉద్దేశంతోనే రంపచోడవరంలోని 'శక్తి' సంస్థ నాయకత్వాన 70 స్వచ్ఛంద సంస్థలు ఫిబ్రవరి 14న శ్రీకాకుళం జిల్లాలో పాతపట్నం నుంచి మొదలుపెట్టి చైతన్య యాత్ర జరుపుతున్నాయి. ఈ యాత్ర ఏప్రిల్ 5న పశ్చిమ గోదావరి జిల్లాలోని పోవన్న దగ్గర ముగిసింది. దారిలో ఏడు జిల్లాల్లో మొత్తం 50కి పైగా గిరిజనాశ్రమాలు సందర్శించి గిరిజనులతో ముఖాముఖీ మాట్లాడి వారి కష్టాలూ, సమస్యలూ తెలుసుకోవడమే కాకుండా వారిని చైతన్యవంతులను చేస్తూ, ఆత్మస్థైర్యం, విశ్వాసం కలిగించడం ఈ యాత్రం లక్ష్యం. ఈ యాత్ర సఫలం కావాలని సమాజ హితైషులందరూ కోరాలి, చేతనైనంత సహకార మందివ్వాలి.

వాసమూర్తి